
సాక్షి ఒడిశా

ఆదివారం । 2 । ఫిబ్రవరి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ.5,60,728
బంగారం : 650 మిల్లీ గ్రాములు
వెండి : 20 గ్రాములు - భువనేశ్వర్/పూరీ



నేటి నుంచి వన్డే మ్యాచ్ టికెట్ల విక్రయం

కటక్ బారాబటి స్టేడియంలో భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య జరగనున్న వన్డే మ్యాచ్ టికెట్ల విక్రయాలు ఆదివారం నుంచి ప్రారంభమవ్వనున్నాయి.

- IIలో



విద్యుదాఘాతంతో మేస్త్రీ మృతి

గజపతి జిల్లాలోని మోహనా పీఎస్ పరిధి జోడిపదర్ గ్రామం వద్ద విద్యుదాఘాతంతో మేస్త్రీ కృష్ణ చంద్ర దళ బెహరా(40) ప్రాణాలు విడిచాడు.

- IIలో

బడ్జెట్ భల్లే భల్లే అదేం లేదు డొల్లే..!

- బడ్జెట్‌పై రాష్ట్రంలో మిశ్రమ స్పందన
- వికసిత్ భారత్‌కు దోహదం: సీఎం మోహన్‌చరణ్
- రాష్ట్రానికి కేటాయింపులు చేయలేదు: ప్రతిపక్షాలు
- 20 మంది ఎంపీలను ఇస్తే రాష్ట్రానికి అన్యాయం చేశారని మండిపాటు



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్

భువనేశ్వర్: పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన 2025–26 ఆర్థిక సంవత్సరపు బడ్జెటుపై రాష్ట్రంలో మిశ్రమ స్పందన లభించింది. ఈ బడ్జెట్ వికసిత్ భారత్ కలలు సాకారం చేసేందుకు దోహదపడుతుందని ఆర్థిక శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తెలిపారు. కొత్త బడ్జెట్‌లో విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, ఎంఎస్‌ఎంఈ, పెట్టుబడులు, పరిశోధన, ఉపాధి వంటి రంగాలకు పెద్దపీట వేశారన్నారు. మధ్య తరగతి, దిగువ ఆదాయ వర్గాల అవసరాలపై దృష్టి సారించి దేశ ఆర్థిక పరిస్థితిని మరింత మెరుగుపరిచేందుకు బడ్జెట్‌లో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. సామాన్య పౌరుల ప్రయోజనాల కోసం చారిత్రాత్మక బడ్జెట్‌ను రూపొందించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ బడ్జెటు భారతదేశం సమగ్ర అభివృద్ధిని వేగవంతం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వికసిత్ భారత్ ఆవిష్కరణకు సహాయపడుతుందన్నారు.

ప్రత్యేక కేటగిరి ఎక్కడ..?: విపక్ష నేత నవీన్ పట్నాయక్

ఒడిశా రాష్ట్రం ప్రతీ సంవత్సరం అనేక ప్రకృతి వైపరీత్యాలతో తల్లడిల్లుతోందని మాజీ సీఎం, విపక్ష నేత నవీన్ పట్నాయక్ అన్నారు. ఈ విపత్కర పరిస్థితి దృష్ట్యా రాష్ట్రానికి ప్రత్యేక కేటగిరీ హోదా న్యాయసమ్మతమైన అభ్యర్థన అని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలకు బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు చేసి, ఒడిశా రాష్ట్రానికి ప్రత్యేక కేటగిరి హోదాను కేంద్రం పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. అలాగే నిరుద్యోగం, నిత్యావసర సరుకుల ధరల పెరుగుదల గురించి ప్రస్తావించకపోవడం దురదృష్టకరమని అసంతృప్తి వ్యక్తం చేశారు.

నిరాశాజనకం: రణేంద్ర ప్రతాప్ స్వంయి

బడ్జెట్‌లో ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు కొంత ఉపశమనం మినహా, ఇతరేతర అంశాలు అత్యంత నిరాశాజనకంగా ఉన్నాయని రాష్ట్ర మాజీ మంత్రి, విపక్ష బిజూ జనతా దళ్ సీనియర్ నాయకుడు రణేంద్ర ప్రతాప్ స్వంయి వ్యాఖ్యానించారు. కాపెక్స్ నిధుల కేటాయింపులో కోత, వ్యవసాయ వ్యయం, పంట బీమా, ఎరువుల సబ్సిడీపై బడ్జెటు ప్రాధాన్యత నిర్వీర్యమైందన్నారు. ఉపాధి హామీ పథకం వంటి జీవనోపాధి పథకాలకు మొక్కుబడిగా నిధులు కేటాయింపు విచారకరమని పేర్కొన్నారు. ఔత్సాహిక యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు బడ్జెటులో స్పష్టత లేదని వ్యాఖ్యానించారు. దేశ ఆర్థిక వ్యవస్థ పునరాభివృద్ధికి అనుకూలమైన బడ్జెట్‌ని ప్రవేశపెట్టడంలో ఎన్డీయే ప్రభుత్వం మరోసారి విఫలమైందన్నారు మండిపడ్డారు.

బడ్జెటు పురస్కరించుకుని సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ తీర్చిదిద్దిన సైకత శిల్పం



రాష్ట్రాన్ని విస్మరించారు: నిరంజన్ పట్నాయక్

2025 – 26 ఆర్థిక సంవత్సరపు కేంద్ర బడ్జెట్‌లో ఒడిశాను పూర్తిగా విస్మరించారు. రాష్ట్రం నుంచి 21 మంది ఎంపీల్లో 20 మంది బీజేపీ అభ్యర్థులు ప్రాతినిధ్యం వహిస్తున్న పరిస్థితుల్లో నరేంద్ర మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి మొండిచేయి చూపిందని రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఆర్థిక శాఖ మంత్రి నిరంజన్ పట్నాయక్ నిరుత్సాహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి సంబంధించి కొత్త బడ్జెటులో ఒక్క ప్రధాన ప్రకటన కూడా లేదని వేలెత్తి చూపారు. గత 10 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం మధ్య తరగతి వర్గం నుంచి రూ.54.18 లక్షల కోట్ల ఆదాయపు పన్ను వసూలు చేసింది. ఈ బడ్జెటులో రూ.12 లక్షల వరకు ఆదాయాన్ని పన్ను మినహాయింపు ప్రకటించడం కంటి తుడుపు చర్యగా పేర్కొన్నారు. ఇది బూటకపు వాగ్దానాలతో కూడిన సరికొత్త బడ్జెట్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు మోదీ ప్రభుత్వం మేక్ ఇన్ ఇండియాను నేషనల్ మ్యానుఫ్యాక్చరింగ్ మిషన్‌గా మార్చిందని దుమ్మెత్తిపోశారు. పాత పథకాలను కొత్త పేర్లతో మార్చి ప్రభావం శూన్య బడ్జెట్‌ని ప్రజలకు కానుకగా సమర్పించి బురిడీ కొట్టించిందని ఆరోపించారు.

న్యూస్‌రీల్

డివైడర్ పైకి దూసుకెళ్లిన కారు



ప్రమాదస్థలంలో ఉన్న కారు

భువనేశ్వర్: స్థానిక డొమొణ ప్రాంతంలో త్రుటిలో ప్రమాదం తప్పింది. ఈ ప్రాంతంలో కారు అదుపు తప్పి డివైడర్‌పై నుంచి దూసుకెళ్లింది. అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణహాని వంటి పరిస్థితులు తలెత్తలేదు. చంద్రశేఖర్‌పూర్ ఠాణా పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి అనుబంధ చర్యలు చేపట్టారు.

యువకుడి ఆత్మహత్య



గణేష్ మృతదేహం

రాయగడ: స్థానిక దోబీ వీధిలో నివసిస్తున్న ఒక యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి మృతుడు దేవర శెట్టి గణేష్ (23)గా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఐఐసీ కేకేబీకే కుహరో తెలియజేసిన వివరాల మేరకు.. గణేష్ అనే వ్యక్తి గత కొన్నాళ్లుగా దోబీ వీధిలో ఒక అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. వంటలు చేసుకుని జీవనోపాధి పొందుతున్న గణేష్ శనివారం మధ్యాహ్నం ఇంటి పైకప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే ఎందుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడు అనే వివరాలు తెలియాల్సి ఉంది.

అనుమానాస్పదంగా బాలుడి మృతి



బాలుడి మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి కేంద్రంలో డైలీ మార్కెట్ వద్ద నివాసముంటున్న సూర్యనారాయణ సాహు ఇంట్లో విషాదం చోటుచేసుకుంది. తన 10 ఏళ్ల కుమారుడు కృష్ణసాహు ఇంట్లో అనుమానాస్పదంగా మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. సూర్యనారాయణ సాహు బయటకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి కుమారుడు ఉరికి వేలాడుతూ కనిపించాడు. దీంతో వెంటనే బాలుడిని కలిమెల ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే బాలుడు మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. ఏం జరిగిందని వైద్యులు ప్రశ్నించడంతో పిల్లాడు ఉరి వేసుకున్నాడని తెలిపారు. దీంతో కలిమెల పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఐఐసీ చంద్రకాంత్ తండి ఆరోగ్య కేంద్రానికి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. బాలుడి మృతదేహాన్ని పరిశీలించగా మెడ భాగంపై తాళం గుర్తు ఉండడంతో పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలుడు కలిమెలలో సరస్వతీ శిశు మందిర్‌లో 4వ తరగతి చదువుతున్నాడు.

దోపిడీకి ప్రయత్నించిన నిందితుడి అరెస్టు



అరెస్టైన నిందితుడు రాజకుమార్ కకిడి

జయపురం: సమితిలోని 26వ జాతీయ రహదారి రొండాపల్లి పెట్రోల్ బంక్ వద్ద ఒక ట్రక్కు డ్రైవర్‌ను దోచుకోవడానికి ప్రయత్నించిన నిందితుల్లో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి శనివారం వెల్లడించారు. గత నెల 30వ తేదీన డెంకనాల్ జిల్లా కామాక్షినగర్‌కు చెందిన హరేకృష్ణ సాహు కుమారుడు పద్మనాభ సాహు చేసిన ఫిర్యాదు మేరకు.. జాతీయ రహదారిపై రొండాపల్లి గ్రామ సమీపంలో పెట్రోలు పంపు వద్ద భోజనం చేసి విశ్రాంతి తీసుకొనేందుకు తన ట్రక్కును నిలిపినట్లు పేర్కొన్నాడు. అదే సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు అకస్మాత్తుగా వచ్చి అతడిపై దాడి జరిపారు. అనంతరం ఫోన్ లాక్కొనేందుకు ప్రయత్నించారని దీంతో పెట్రోలు పంపు వద్దనున్న వారు వచ్చి కాపాడినట్లు పేర్కొన్నారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా జయపురం సమితి నందగుడ గ్రామానికి చెందిన రాజకుమార్ కకిడి మరో వ్యక్తితో కలిసి దోపిడీకి ప్రయత్నించినట్లు వెల్లడైందన్నారు. నిందితుడిని అరెస్టు చేశామని, మరొకరు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

ముగిసిన అంతర్ కళాశాలల క్రీడా పోటీలు



క్రీడా పోటీల ముగింపు ఉత్సవంలో పాల్గొన్న వర్సిటీ సిబ్బంది

జయపురం: స్థానిక విక్రమదేవ్ విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. ఫూల్‌బెడ ప్రాంతంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన ముగింపు పోటీల్లో వర్సిటీ ఉప కులపతి ప్రొ.దేవీ ప్రసాద్ మిశ్ర, రిజిస్ట్రార్ రంజన్ కుమార్ మిశ్రలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ దేవీప్రసాద్ మిశ్ర మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు పోటీలు ప్రశాంతంగా జరిగినందుకు సంతోషంగా ఉందన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని పేర్కొన్నారు. క్రీడా ఉత్సవంలో ఓవరాల్ చాంపియన్స్‌గా విక్రమదేవ్ విశ్వవిద్యాలయ పురుషుల టీమ్, కొరాపుట్ ప్రభుత్వ కళాశాల మహిళా టీమ్‌లు నిలిచాయి. అదేవిధంగా వ్యక్తిగత క్రీడాకారుల్లో నవరంగపూర్ ఆదర్శ స్నాతక కళాశాల విద్యార్థి తులారాం మాఝి చాంపియన్ కాగా, కొరాపుట్ ప్రభుత్వ కళాశాల జానకీ చలాన్ వ్యక్తిగత మహిళా చాంపియన్‌గా నిలిచారు. విజేతలను పలువురు అభినందించారు. విజేతలు విశ్వవిద్యాలయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.



క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న వర్సిటీ వీసీ దేవీ ప్రసాద్ మిశ్ర

ద్విచక్ర వాహనదారులకు అపరాధ రుసుము



పట్టుబడిన ద్విచక్ర వాహనాలు

జయపురం: పట్టణంలో శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న ద్విచక్ర వాహనాల సైలెన్సర్లపై పట్టణ పోలీసులు దృష్టి సారించారు. నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్లు వాడుతున్నవారికి అపరాధ రుసుము విధిస్తున్నారు. ఈ మేరకు నాలుగు ద్విచక్ర వాహనాలకు సంబంధించి రూ.8 వేల ఫైన్ వేసినట్లు పట్టణ పోలీసు అధికారి రమణీ రంజన్ దొళాయి శనివారం వెల్లడించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రహదారి నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు.

జోరుగా రేషన్ కార్డుల ఉపసంహరణ

- ఉపసంహరించుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగులు



ఆహార భద్రత రేషన్ కార్డులు

భువనేశ్వర్: రాష్ట్రంలో రేషన్‌కార్డుల ఉపసంహరణ జోరుగా సాగుతోంది. దాదాపు 8 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు గత రెండు రోజుల స్వల్ప వ్యవధిలో తమ రేషన్ కార్డులను ఉపసంహరించుకున్నారని రాష్ట్ర ఆహార సరఫరా, వినియోగదారుల సంక్షేమ శాఖ మంత్రి కృష్ణచంద్ర పాత్రో ధ్రువీకరించారు. జాతీయ ఆహార భద్రతా చట్టం కింద అనర్హులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వ హెచ్చరికతో ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి 31 నాటికి మొత్తం 20,000 మంది పైబడి అనర్హులు రేషన్ కార్డులను ఉపసంహరించుకున్నారు. వీరిలో చివరి రెండు రోజుల్లో 8 వేల మంది కార్డులు అప్పగించారు.

ఇదీ విషయం...

ఈ ఏడాది జనవరి 23వ తేదీన మంత్రి కృష్ణచంద్ర పాత్రో మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 30 జిల్లాల్లోని ప్రతీ మండలంలో దాదాపు 200 నుండి 300 మంది అనర్హులు రేషన్ కార్డులను కలిగి ఉన్నారని పేర్కొన్నారు. వీరిలో అత్యధికులు ఆర్థికంగా బాగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగులుగా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రేషన్ కార్డుల ఉపసంహరణకు జనవరి 31 వరకు గడువు విధించారు. నిబంధనల మేరకు గడువులోగా రేషను కార్డులు ఉపసంహరించుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఉల్లంఘనకు పాల్పడి అక్రమంగా కార్డులు కలిగి ఉన్నవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రకారం నెలకు రూ.15,000 లేదా అంతకంటే ఎక్కువ ఆదాయం పొందుతున్న వారు రేషన్ కార్డుకు అనర్హులుగా పరిగణించబడతారు. వీరంతా రేషన్ కార్డులు ప్రభుత్వానికి ఫిరాయించాల్సి ఉంటుందని మంత్రి పేర్కొనడం గమనార్హం. అయితే రేషన్ కార్డ్ ఈ-కేవైసీ గడువును ఈనెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు మంత్రి కృష్ణచంద్ర పాత్రో తెలిపారు.

భృగు భక్షిపాత్రోకి కీలక బాధ్యతలు



మాజీ సీఎం నవీన్ పట్నాయక్‌తో భృగుభక్షి పాత్రో

కొరాపుట్: విపక్ష బీజేడీలో భృగు భక్షిపాత్రోకి కీలక బాధ్యతలు అప్పగించారు. కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్, మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ అసెంబ్లీ నియోజకవర్గాల బీజేడీ పరిశీలకుడిగా నియమించారు. పార్టీ రాష్ట్ర కో–ఆర్డినేషన్ కమిటీ అధ్యక్షుడు దేవీప్రసాద్ మిశ్ర ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. భృగు గత సార్వత్రిక ఎన్నికల్లో బ్రహ్మపుర పార్లమెంట్ స్థానానికి పోటీచేసి ఓటమి పాలయ్యారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహితో నాయకులు, రైతులు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో అధికారులు ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా చేపట్టాలని పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి కోరారు. ఈ మేరకు పలువురు రైతులతో పాటు ఆయన కలెక్టర్‌ను శనివారం కలిశారు. జనవరి 7వ తేదీన ధాన్యం కొనుగోళ్లకు మండీలు తెరచినా, ఇప్పటివరకు 90 శాతం మంది రైతులు ప్రభుత్వ మద్దతు ధరకు అమ్మలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 2,12,212 క్వింటాళ్ల ధాన్యం సేకరణ అధికారులు లక్ష్యం పెట్టుకోగా, మొదటి పర్యాయం ఇప్పటివరకూ కనీసం 50 శాతం కూడా అధికారులు ఖరీఫ్ ధాన్యం సేకరించలేకపోయారన్నారు. అందువలన కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్‌ను కలిసినవారిలో కాశీనగర్ సమితి అధ్యక్షురాలు బల్ల సాయమ్మ, జెడ్పీటీసీ ఎస్.బాలరాజు, సీనియర్ బీజేడీ నాయకులు ఎస్.గజపతిరావు, జి.లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

సోనియా గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ నిరసన



జయపురం: సోనియా దిష్టిబొమ్మను తగలబెడుతున్న దృశ్యం



కొరాపుట్: ఆందోళన నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గౌరీ శంకర్ మఝి తదితరులు

కొరాపుట్: భారత రాష్ట్రపతి ప్రసంగంపై సోనియా గాంధీ చేసిన వ్యాఖ్యలను బీజేపీ ఖండించింది. ఈ మేరకు నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని మెయిన్ రోడ్డులో గాంధీ జంక్షన్ వద్ద ఆ పార్టీకి చెందిన నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మఝి నేతృత్వంలో ఆందోళన చేపట్టారు. వెనుకబడిన వర్గాలకు చెందిన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముపై కాంగ్రెస్ అనుచిత వ్యాఖ్యలు చేస్తోందన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు భారత రాజ్యాంగం అంటే గౌరవం లేదన్నారు. గిరిజన తెగకి చెందిన ద్రౌపది ముర్ముపై అనుచిత వ్యాఖ్యలను తాను ఒక గిరిజనుడిగా ఖండిస్తున్నానని గౌరీ శంకర్ మఝి ప్రకటించారు.

జయపురం: పార్లమెంట్ బడ్జెట్ సెషన్స్ ప్రారంభంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ అధినాయకురాలు సోనియా గాంధీ చేసిన వాఖ్యలపై బీజేపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ప్రసంగంపై అక్కసుతో బోరు కొట్టిందని, రాజకీయంగా ఉందని సోనియగాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ ఉద్దేశంతో కూడినవిగా పేర్కొన్నారు. ఈ మేరకు సోనియా గాంధీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే ఆమె తన పదవికి రాజీనామా చేయాలన్నారు. అనంతరం జయపురం పట్టణ బీజేపీ అధ్యక్షుడు ఎస్.మనోజ్ నేతృత్వంలో సోనియా గాంధీ చిత్రపటానికి దగ్ధం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చ పట్టణ అధ్యక్షురాలు భవానీ రెడ్డి, జయపురం బీజేపీ మండల్ ఉపాధ్యక్షుడు రఘునాథ్ పాణిగ్రహి, రాష్ట్ర కార్యవర్గ కమిటీ సభ్యురాలు సురభి పాణి, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ శాశ్వత సభ్యుడు గౌతమ సామంతరాయ్, సన చౌదరి తదితరులు పాల్గొన్నారు.

రాయగడ: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ, సోనియా గాంధీలు క్షమాపణ చెప్పాలని బీజేపీ శ్రేణులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో బీజేపీ మహిళా మోర్చా స్థానిక కాపిలాస్ కూడలి వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారి దిష్టి బొమ్మలను దగ్ధం చేశారు. కార్యక్రమంలో బీజేడీ జిల్లా అధ్యక్షుడు శివ కుమార్ పట్నాయక్, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురామ్ మచ్చ తదితరులు పాల్గొన్నారు.



రాయగడ: ఆందోళన చేస్తున్న బీజేపీ శ్రేణులు

క్లుప్తంగా

యువకుడిపై కత్తితో దాడి


గాయాలతో చికిత్స పొందుతున్న కిరణ్

రాయగడ: ఇచ్చిన బాకీని తీర్చలేదన్న కోపంతో ఒక యువకుడిపై కత్తితో దాడిచేసిన సంఘటన రిరిని ఘటన స్థానిక పీహెచ్‌సీ సమీపంలోని హనుమాన్ మందిరం ప్రాంగణంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పవన్ కుమార్ అనే వ్యక్తి కిరణ్ కుమార్ కొండగిరి అనే యువకుడికి రూ.1,200లు అప్పుగా ఇచ్చాడు. ఈ క్రమంలో తాను ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వమని పవన్ పట్టుబట్టాడు. అయితే తన వద్ద డబ్బులు లేవని త్వరలో తీర్చేస్తానని కిరణ్ చెప్పాడు. అందుకు ససేమిరా అన్న పవన్ ఎలాగైన డబ్బులు ఇవ్వాలని అనడంతో, ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో కోపోద్రిక్తుడైన కిరణ్‌పై కత్తితో దాడి చేశాడు. దాడిలో కిరణ్ ఎడమ చేతికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసిన సదరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కొత్త డీజీపీని కలిసిన ఎస్పీ


డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాని కలిసిన ఎస్పీ కె.వి.మహేశ్వర్‌రెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : రాష్ట్ర కొత్త డీజీపీగా బాధ్యతలు చేపట్టిన హరీష్‌కుమార్ గుప్తాను జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం రాష్ట్ర పోలీస్ కార్యాలయంలో డీజీపీని కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

మహా కుంభమేళాకు టెక్కలి నుంచి ఆర్టీసీ బస్సులు

టెక్కలి: ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు టెక్కలి, పలాస డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సు సేవలు అందజేస్తున్నట్లు డిపో మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 12వ తేదీ సాయంత్రం 3 గంటలకు బయల్దేరి ప్రయాగ్ రాజ్ దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణంలో త్రివేణి సంగమం, కాశీ విశ్వేశ్వరస్వామి జ్యోతిర్లింగం, కాశీ అన్నపూర్ణ, కాశీ విశాలాక్షి, మహాబోధి ఆలయం, శ్రీ విష్ణుపాద ఆలయం, మంగళగౌరీ శక్తి పీఠం, కోణార్క్ సూర్యదేవాలయం, పూరీ, భువనేశ్వర్ లింగరాజు ఆలయం దర్శనం అనంతరం టెక్కలి చేరుకోనున్నట్లు డీఎం వెల్లడించారు. ఏడు రోజులు కొనసాగనున్న ఈ యాత్రకు అల్పాహారం, భోజనం తో కలిపి ఒక్కొక్కరికి రూ.9500 టికెట్‌గా నిర్ణయించినట్లు తెలిపారు. వివరాలకు 9959225611, 7382923311, 7382923507 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

మరో రెండు మద్యం షాపులు మంజూరు


మాట్లాడుతున్న సీఐ గోపాలకృష్ణ

శ్రీకాకుళం క్రైమ్ : నూతన మద్యం పాలసీలో భాగంగా శ్రీకాకుళం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్ పరిధిలో అదనంగా రెండు మద్యం దుకాణాలు మంజూరయ్యాయని సీఐ ఎం.వి.గోపాలకృష్ణ శనివారం తెలిపారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సెగిడి కులస్తులకు, శ్రీకాకుళం మండల పరిధిలో సొండి కులస్తులు వీటికి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, రూ.2 లక్షల డీడీని డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్, శ్రీకాకుళం పేరిట తీసి ఎక్సైజ్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. సెగిడి కులస్తులకు ఈ నెల 7న ఆదివారం ఆర్డీవో కార్యాలయంలో, సొండి కులస్తులకు ఈ నెల 8న కలెక్టర్ కార్యాలయంలో డ్రా తీస్తామని పేర్కొన్నారు.

ధాన్యం తిని 40 గొర్రెలు మృతి

టెక్కలి రూరల్: మండలంలోని గూడెం పంచాయతీ పిట్టలసరియా గ్రామంలో శనివారం ధాన్యం తిని సుమారు 40 గొర్రెలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్టలసరియా గ్రామానికి చెందిన గండేటి అప్పలస్వామి, అంబల మల్లేషు, జోగ గంగయ్యలు తమ గొర్రెలను సందిగాం మండలం బడబంద సమీపంలోకి మేతకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో పొలంలో ఎన్నులు, ధాన్యం గింజలు తిని తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. వాటిలో గండేటి అప్పలస్వామికి చెందిన 32 గొర్రెలు, మల్లేషు, జి.గంగయ్యలకు చెందిన 8 గొర్రెలు మృతిచెందినట్లు బాధిత రైతులు తెలిపారు. వీటి విలువ రూ.5లక్షలకు పైగా ఉంటుందని చెప్పారు. విషయం తెలుసుకున్న అధికారులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

నేటి నుంచి వన్డే మ్యాచ్ టికెట్ల విక్రయం



టికెట్ల ధరలు	
గ్యాలరీ	ధర (రూ.ల్లో)
1, 3	1,100
2, 4	900
5	1,200
7	700
ప్రత్యేక ఎన్‌క్లోజర్	6,000
ఏసీ బాక్స్	8,000
కొత్త పెవిలియన్	10,000
కార్పొరేట్ బాక్స్	20,000

భువనేశ్వర్: కటక్ బారాబటి స్టేడియంలో భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య జరుగనున్న వన్డే ఇంటర్నేషనల్ మ్యాచ్ టికెట్ల ఆన్‌లైన్ విక్రయం ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి ఆరంభం కానుంది. డిస్ట్రిక్ట్ బై జోమాటో యాప్‌లో ఆన్‌లైన్ టికెట్ల విక్రయం సౌలభ్యం కల్పించారు. ఈనెల 9న ఈ మ్యాచ్ జరుగుతుందని ఒడిశా క్రికెట్ అసోసియేషన్ (ఓసీఏ) తెలిపింది. ఆన్‌లైన్ విక్రయాలకు 4,000 టికెట్లు పరిమితం చేశారు. ఫిబ్రవరి 7వ తేదీ నుంచి 9 వరకు కటక్‌లోని కేంబ్రిడ్జ్ స్కూల్, భువనేశ్వర్‌లోని కిట్ యూనివర్సిటీలో ఆఫ్‌లైన్ టికెట్ల విమోచన జరుగుతుంది. అలాగే ఈనెల 5, 6 తేదీల్లో వరుసగా రెండు రోజులు కటక్ బారాబటి స్టేడియంలోని కౌంటర్లలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుంది. టికెట్ కొనుగోలు కోసం చెల్లుబాటు అయ్యే గుర్తింపు కార్డు (ఐడీ) దాఖలు చేయడం అనివార్యం. ఒక్కో అభ్యర్థి గరిష్టంగా 2 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేయవచ్చు.

గనుల తవ్వకాలపై నిరసన


నిరసన ర్యాలీ చేపడుతున్న దృశ్యం

కొరాపుట్: జిల్లాలో గనుల తవ్వకాలపై జయపూర్ ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి మండిపడ్డారు. ఈ మేరకు కొరాపుట్ జిల్లా కేంద్రంలో శనివారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో లక్ష్మీపూర్, నందపూర్ తదితర ప్రాంతాల్లో అదానీ కంపెనీ వ్యక్తులు గనులను దోచుకొని తరలించుకుపోతున్నారని దుయ్యబట్టారు. అభివృద్ధి పేరుతో గనులు తరలించడంపై ఆక్షేపించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు.

విద్యుదాఘాతంతో మేస్త్రి మృతి


విద్యుత్ తీగలకు బలైన మేస్త్రి కృష్ణచంద్ర దళ బెహరా


మోహనా, చాందిపుట్ రోడ్డులో రోడ్డుకు అడ్డంగా చెట్టు కొమ్మలు పెట్టిన దృశ్యం

పర్లాకిమిడి: జిల్లాలోని మోహనా పీఎస్ పరిధి జోడిపదర్ గ్రామం వద్ద విద్యుదాఘాతంతో మేస్త్రి కృష్ణచంద్ర దళ బెహరా(40) ప్రాణాలు విడిచాడు. దీంతో జోడిపదర్ గ్రామస్తులు విద్యుత్ అధికారులపై మండిపడి ఆందోళన చేపట్టారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆందోళన చేపట్టడంతో మోహనా, ఆర్.ఉదయగిరి, రాయగిరి, పర్లాకిమిడికి వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. వివరాల్లోకి వెళ్తే.. జోడిపదర్ గ్రామం వద్ద ఐటీఐ వద్ద కొత్త విద్యుత్ స్తంభాలు వేశారు. అయితే వాటిలో మెయిన్ లైన్ విద్యుత్ తీగలు రోడ్డుకు అడ్డంగా తెగిపడడంతో, మేస్త్రి కృష్ణచంద్ర దళబెహరా అటువైపు వేరే గ్రామానికి సైకిల్‌పై వెళ్తూ విద్యుదాఘాతానికి గురయ్యాడు. సమాచారం అందుకున్న మృతుని బంధువులు, గ్రామస్తులు మృతికి కారణమైన విద్యుత్ అధికారులపై విరుచుకుపడ్డారు. మృతుని కుటుంబానికి నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ లాల్ బహదూర్ శాస్త్రి హైస్కూల్ సమీపంలో జాతీయ రహదారి వద్ద రోడ్డుకు అడ్డంగా రాళ్లు పెట్టి ఆందోళన చేపట్టారు. దీంతో మధ్యాహ్నం 2 గంటల తర్వాత మోహనా తహసీల్దార్, మోహనా ఐఐసీ బసంత శెటి, విద్యుత్ శాఖ అధికారులు విచ్చేసి మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తామని తెలియజేశారు. దీంతో ఆందోళనకారులు శాంతించారు.

ఘనంగా మార్కండేయ మహర్షి జయంతి ఉత్సవాలు


కలశ యాత్రలో పాల్గొన్న మహిళలు

రాయగడ: పట్టణంలోని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ మహర్షి జయంతి ఉత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. స్థానిక జగన్నాథ మందిరం నుంచి ముందుగా ఊరేగింపు కార్యక్రమం జరిగింది. మహిళలు కలశాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం బాలాజీనగర్‌లో ఉన్న కల్యాణ వేంకటేశ్వర మందిరం కల్యాణ మండపంలో రుద్రాభిషేకం, హోమం, పూజ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక సభలో కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మాచ, బీజేడీ జిల్లా అధ్యక్షుడు శివ కుమార్ పట్నాయక్, ఆ పార్టీ నాయకుడు టుటు దాస్, సంఘం అధ్యక్షుడు బి.నింహాచలం, కార్యదర్శి టి.ఉమా మహేశ్వరరావు, ఎం ఎస్.రావు తదితరులు పాల్గొన్నారు.


జానపద నృత్యాలు


కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

విద్యార్థులను వేధిస్తున్నారు


ఫీజు రీయింబర్స్‌మెంట్ ధర్నా పోస్టర్‌ను విడుదల చేస్తున్న నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త పిరియా విజయ తదితరులు

కంచిలి: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో పెట్టి కూటమి ప్రభుత్వం విద్యార్థులను వేధిస్తోందని ఇచ్ఛాపురం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ ఆరోపించారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 5వ తేదీన పార్టీ అధిష్టానం పిలుపుమేరకు వైఎస్సార్ సీపీ చేపట్టబోయే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు ఆమె క్యాంపు కార్యాలయం బల్లిపుట్టుగ గ్రామంలో ఈ నెల 5న చేపట్టనున్న ధర్నా కార్యక్రమ పోస్టర్‌ను శనివారం సాయంత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, సోంపేట ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, ఇచ్ఛాపురం ఎంపీపీ బోర పుష్ప, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు రాంపల్లి చిట్టిబాబు, సోంపేట మండల పార్టీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ చర్యలు సరికాదు

● కాంగ్రెస్ ఎమ్మెల్యేల ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కద్రక, హికాక తదితరులు

రాయగడ: జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆసీమా రావ్‌పై కలెక్టర్ ఫరూల్ పట్వారీ తీసుకున్న క్రమశిక్షణ చర్యలు సరికావని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆరోపించారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు కంకర్నన్ మంగరాజ్ ఆధ్వర్యంలో శనివారం కాంగ్రెస్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక, బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ హికాకలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదివాసీ, హరిజన ప్రాంతమైన ఈ జిల్లాలో సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎంతోమంది విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. అటువంటి శాఖలో నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్న సంక్షేమ శాఖ అధికారిపై జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారీ తీసుకున్న చర్యలు ఏమాత్రం ఆమోదదగినవి కావన్నారు. ఈ విషయమై రాష్ట్ర సంక్షేమ శాఖ అధికారి కల్పించుకొని సమన్వయ పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా విధులకు సక్రమంగా హాజరవ్వపోవడం, అత్యవసర సమావేశాలకు గైర్హాజరు వంటి కారణాల దృష్ట్యా కలెక్టర్ చర్యలు తీసుకొని, విధుల నుంచి తప్పించి సంబంధిత శాఖ కార్యాలయానికి వెళ్లి వివరణ ఇవ్వాల్సిందిగా ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే తప్పు కక్ష సాధింపు చర్యలు పాల్పడినట్టు జిల్లా సంక్షేమ శాఖ అధికారి మనస్తాపానికి గురై తనకు న్యాయం చేయాలని కోరుతూ కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం.

ప్రాణాలు తీసిన వివాహేతర సంబంధాలు

జిల్లాలో ఇటీవల వేర్వేరు చోట్ల జరిగిన అనుమానాస్పద మృతుల కేసులను పోలీసులు ఛేదించారు. రెండు ఘటనలకూ వివాహేతర సంబంధాలే కారణమని నిర్ధారించారు. ఆయా కేసుల్లో నిందితులను అరెస్టు చేసి విలేకరులకు వివరాలు వెల్లడించారు.



వివరాలు వెల్లడిస్తున్న శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద

● వివాహేతర సంబంధానికి అడ్డుగా వస్తున్నాడని ఘాతుకం
● దాడి చేసి చంపేసిన ప్రియుడు, అతని స్నేహితులు

ఆమదాలవలస: మండలంలోని బొబ్బిలిపేట సమీపంలో గత నెల 25వ తేదీ రాత్రి జరిగిన గురుగుబిల్లి చంద్రయ్య హత్య కేసు మిస్టరీ వీడింది. హత్య కేసులో రాజకీయ కోణం లేదని, కేవలం వివాహేతర సంబంధమే ఈ ఘటనకు కారణమని, ఇందులో ప్రమేయమున్న 10 మందిని శనివారం అరెస్టు చేసినట్లు శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద తెలిపారు. ఈ మేరకు ఆమదాలవలస పోలీస్‌స్టేషన్‌లో నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. గురుగుబిల్లి చంద్రయ్య భార్య ఈశ్వరమ్మకు అదే గ్రామానికి చెందిన చింతాడ బాలమురళీకృష్ణతో కొన్నాళ్లుగా వివాహేతర సంబంధం నడుస్తోంది. విషయం తెలుసుకున్న భర్త చంద్రయ్య భార్యను మందలించి సెల్‌ఫోన్ వాడకుండా కట్టుదిట్టం చేయడంతో పాటు బాలమురళీకృష్ణతో ఉన్న ఆర్థిక లావాదేవీలను కూడా నిలుపుదల చేశాడు. దీంతో కక్షసాధించుకున్న బాలమురళీకృష్ణ చంద్రయ్యను తెలియకుండా మరొక ఫోన్‌తో ఈశ్వరమ్మతో రహస్య సంభాషణలు సాగించేవాడు. ఈ క్రమంలో తమకు అడ్డంగా ఉన్న చంద్రయ్యను చంపాలని ఉద్దేశంతో తన సోదరుడు, శ్రీనివాసాచార్యులపేటకు చెందిన గురుగుబిల్లి అరవింద్ సాయం తీసుకున్నాడు. అతను తన స్నేహితుడైన బూర్జ మండలం ఉప్పినవలసకు చెందిన వంశీ, గణేష్‌లను కూడా రంగంలోకి దించాడు. వీరంతా కలిసి చంద్రయ్యను హతమార్చడానికి బొబ్బిలిపేట సమీపంలో పథకం ప్రకారం వెంటనే రోజులు మాటువేసినా ఫలితం లేకపోయింది. ఈ 25న చంద్రయ్య ఇంటి వద్ద బయలుదేరిన వెంటనే ఈశ్వరమ్మ చెరువు వద్ద ఎదురుచూస్తున్న బాలమురళీకృష్ణకు ఫోన్ చేసి చెప్పింది. స్కూటీపై వస్తున్న చంద్రయ్యను వీరంతా అడ్డగించి బీరు సీసాలు, కర్రలతో ముకుమ్మడిగా దాడి చేసి హతమార్చారు. మృతదేహాన్ని పక్కనే ఉన్న చెరువులోకి ఈడ్చుకెళ్లి తుప్పల చాటున పడేశారు. అదే రోజు రాత్రి భార్య ఈశ్వరమ్మ ముందుగా భర్త కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. మర్నీ అర్ధరాత్రి సమయంలో తన భర్త శవంగా పొలాల్లో పడి ఉన్నాడని పోలీసులకు సమాచారం అందించింది. ఈ ఘటనపై ఆమదాలవలస సీఐ పి.సత్యనారాయణ, ఎస్ఐ ఎస్.బాలరాజు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. విచారణలో బొబ్బిలిపేటకు చెందిన చింతాడ బాలమురళీకృష్ణ ప్రధాన నేరస్తుడుగా, ఉప్పినవలసకు చెందిన గొల్లపల్లి వంశీ, సవలాపురం గణేష్, బొబ్బిలిపేటకు చెందిన చంద్రయ్య భార్య జి.ఈశ్వరమ్మలను తదుపరి నేరస్తులుగా, సవలాపురం ప్రవీణ్, బొమ్మాలి శ్రీవర్ధన్(శివ), బొమ్మాలి ఉమామహేష్, ఈసర్లపేటకు చెందిన యర్రంశెట్టి కృష్ణ, శ్రీనివాసాచార్యులపేటకు చెందిన గురుగుబిల్లి అరవింద్‌తో పాటు మరో మైనర్‌కు కూడా నేరంలో ప్రమేయమున్నట్లు గుర్తించారు. వీరందరిని అరెస్టు చేసి స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. అనుమానాస్పద హత్యగా కేసు నమోదు చేసిన తక్కువ సమయంలో మిస్టరీని ఛేదించిన సీఐ, ఎస్ఐ, సిబ్బందిని ఎస్పీ కె.వి.మహేశ్వర్ రెడ్డి, డీఎస్పీ వివేకానంద అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న కాశీబుగ్గ డీఎస్పీ వెంకటప్పారావు

అనుమానమే పెనుభూతమై..


● వీడిన జడి కొర్లాకుడి హత్య కేసు
● భార్యతో చనువుగా ఉంటున్నాడని యువకుడి దారుణ హత్య

కాశీబుగ్గ: పలాసలో వారం రోజుల కిందట సంచలనం రేపిన గుర్తు తెలియని మృతదేహం కేసును పోలీసులు ఛేదించారు. భార్యతో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడని అనుమానంతో యువకుడిని అతని స్నేహితుడే హత్య చేసినట్లు నిర్ధారించారు. ఈ ఘటనకు సంబంధించి కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ ఎం.వెంకటప్పారావు శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. కాశీబుగ్గ ఎస్సీ వీధికి చెందిన కామిటి శ్రీను, నవర జాన్ స్నేహితులు. కాశీబుగ్గ ప్లాస్టిక్ క్రమ్ కాలనీలో ఓ జిల్ పరిశ్రమలో పనిచేస్తున్నారు. శ్రీను తరచూ జాన్ ఇంటికి వెళుతుండేవాడు. అవివాహితుడైన శ్రీను భోజనం కూడా జాన్ ఇంట్లోనే చేసేవాడు. ఈ క్రమంలో తన భార్యతో శ్రీను వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని జాన్ అనుమానం పెంచుకున్నాడు. ఎలాగైనా శ్రీనును చంపాలని నిర్ణయించుకున్నాడు. గత నెల 24న సాయంత్రం మూడు గంటల సమయంలో శ్రీను ఇంటికి జాన్ వెళ్లాడు. అక్కడి నుంచి ఇద్దరూ కోసంగిపురం వెళ్లి పూటుగా సారా తాగారు. తిరిగి కాశీబుగ్గ వెళుతుండగా సబ్ స్టేషన్ సమీపంలోని కాలనీ వద్ద బరన్ రాడ్‌తో శ్రీను తలపై మోదాడు. దీంతో శ్రీను (26) అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం ఏమీ తెలియనట్టు జాన్ వచ్చేశాడు. మరుసటిరోజు మరోసారి మృతదేహం వద్దకు వెళ్లి శ్రీను చనిపోయినట్టు నిర్ధారించుకున్నాడు. ఇంతలో శ్రీను తల్లి కామిటి సీలమ్మ కుమారుడు కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. పోలీసులు తన కోసం గాలిస్తున్నట్టు తెలుసుకున్న జాన్ కోసంగిపురం పంచాయతీ కార్యదర్శి వద్దకు వెళ్లి శ్రీనును తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. అనంతరం కాశీబుగ్గ పోలీసులకు లొంగిపోయాడు. విలేకరుల సమావేశంలో కాశీబుగ్గ పట్టణ సీఐ పి.సూర్యనారాయణ, హెచ్‌సీ శ్రీనువాసరావు, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణా అడ్డగింత

సోంపేట: పశువులను పరిమితికి మించి అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని బారువ ఎస్ఐ హరిబాబునాయుడు అన్నారు. మండలంలోని కొర్లాం జాతీయ రహదారి వద్ద ఒడిశా నుంచి హైదరాబాద్‌కు వ్యాన్‌లో తరలిస్తున్న 22 గేదెలను శనివారం ఉదయం పట్టుకున్నారు. గేదెలను గోశాలకు తరలించారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని, డ్రైవర్, క్లీనర్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

● సూర్యచంద్రుల వైభవం


అరసవల్లిలో శనివారం సాయంత్రం వేళ సూర్యనారాయణ స్వామి ఆలయం శిఖరాన నెలవంక కనువిందు చేసింది. దక్షిణాయన నేపథ్యంలో ఆలయ పరిసరాల్లో విద్యుద్దీప కాంతులతో మెరిసిపోతున్న వేళ ఈ దృశ్యం ఆవిష్కృతమైంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

క్లుప్తంగా

వెయిట్ లిఫ్టింగ్‌లో పల్లవికి బంగారు పతకం



పల్లవిని అభినందిస్తున్న జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ నాయకులు

విజయనగరం: ఉత్తరాఖండ్‌లో జరుగుతున్న 38వ జాతీయ నేషనల్ గేమ్స్‌లో వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో జిల్లాకు చెందిన ఎస్.పల్లవి బంగారు పతకం సాధించినట్లు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ కార్యదర్శి, కోచ్ చల్లా రాము శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 71 కేజీల కేటగిరిలో 212 కేజీల బరువు ఎత్తి పల్లవి బంగారు పతకం సాధించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పల్లవిని జిల్లా ఒలింపిక్ అసోషియేషన్ నాయకులు అభినందించినట్లు తెలిపారు.

పదెకరాల చెరకు తోట దగ్ధం



ప్రమాదంలో కాలిపోతున్న చెరకు పంట

వంగర : మండలంలోని చిన్నరాజులగుమ్మడ గ్రామానికి చెందిన పంట పొలాల్లో శనివారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన ద్వారపురెడ్డి చంద్రశేఖర్, నాగేశ్వరరావు, సింహాచలం నాయుడు, శ్రీనివాసరావు, ప్రభాకర్‌లకు చెందిన పదెకరాల చెరకు పంట పూర్తిగా కాలిపోయినట్టు పాలకొండ అగ్నిమాపక శాఖ ఎస్‌ఐ జామి సర్వేశ్వరరావు తెలిపారు. ప్రమాదం సంభవించిన వెంటనే రైతులు గమనించి గ్రామస్తులకు సమాచారం అందించారు. అందరూ అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినా ఫలితం కనిపించలేదు. ఇంతలో రాజులగుమ్మడ పంచాయతీ మాజీ సర్పంచ్ ద్వారపురెడ్డి ఉషారాణి అగ్నిమాపక కేంద్రాలకు సమాచారం ఇవ్వగా, పాలకొండ అగ్నిమాపక శాఖ అధికారులు ఫైర్ ఇంజిన్‌తో అక్కడకు వచ్చి మంటలను అదుపు చేశారు. చుట్టుపక్కల చెరకు పంటలకు మంటలు వ్యాపించకుండా మంటలను అదుపు చేశారు. రూ.10 లక్షలకు పైగా ఆస్తినష్టం ఉంటుందని గ్రామస్తులు, రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ప్రారంభమైన కొండదాబాల యాత్ర



జ్ఞానాపురం నుంచి వ్యాకులమాతతో పాదయాత్రగా వస్తున్న భక్తులు

కొత్తవలస: మండలంలోని కొండదాబాల వ్యాకులమాత పుణ్యక్షేత్రం యాత్ర శనివారం వైభవంగా ప్రారభమైంది. విశాఖపట్నం జిల్లా జ్ఞానాపురం నుంచి వేలాది మంది భక్తులు పాదయాత్రగా కొండదాబాలకు చేరుకున్నారు. కనికరమాతను ప్రత్యేక వాహనంపై అలకంరించి తోడ్కొని వచ్చారు. ఎంతో చరిత్ర గల ఈ యాత్రకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటూ ఒడిశా, చత్తీస్‌ఘడ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తున్నారు. ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి యాత్ర ముగుస్తుందని కొండదాబాల విచారణకర్త గొంగాడ రాజు తెలిపారు.

ముగిసిన నవదిన ప్రార్థనలు

వ్యాకులమాత పుణ్యక్షేత్రంలో గడిచిన తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న నవదిన ప్రార్థనలు శనివారం రాత్రి ముగిశాయి. యాత్ర ప్రారంభం కావడంతో కొండదాబాల ప్రాంతాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. 147 మంది సిబ్బంది, ఆరుగురు ఎస్‌ఐలు, ఇద్దరు సీఐలతో స్థానిక సీఐ షణ్ముఖరావు ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌కు ఎక్కడా అంతరాయం లేకుండా తగు జాగ్రత్తలను తీసుకున్నారు. వాహనాలు పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాన్ని కేటాయించారు.

రాష్ట్ర నూతన డీజీపీని కలిసిన ఎస్పీ కమాండెంట్



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన డీజీపీగా బాధ్యతలు చేపట్టిన హరీష్‌కుమార్ గుప్తాను ఎస్పీ వకుల్ జిందల్, ఐదో బెటాలియన్ కమాండెంట్ మాలిక గార్గ్‌లు డీజీపీ కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కలను అందజేసి అభినందనలు తెలిపారు.

- విజయనగరం క్రైమ్

క్లస్టర్ల ఏర్పాటుకు కసరత్తు!

- సీఆర్పీ పోస్టుల కుదింపే లక్ష్యంగా స్కూల్ కాంప్లెక్స్‌లు రద్దు
- సీఆర్పీలున్న 162 కాంప్లెక్స్‌ల స్థానంలో 131 క్లస్టర్లుగా కుదింపు
- ఎంఈఓ అధికారాలను క్లస్టర్ హెచ్‌ఎంలకు బదలాయింపు
- క్లస్టర్ విధానంపై ఉపాధ్యాయ సంఘాల పెదవి విరుపు



స్కూల్ కాంప్లెక్స్ భవనం

విజయనగరం అర్బన్: పాఠశాల విద్యా శాఖలో కీలకమైన స్కూల్ కాంప్లెక్స్‌ల విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. వాటి స్థానంలో క్లస్టర్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఇటీవల రాష్ట్ర విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. క్లస్టర్ల ఏర్పాటుకు సంబంధించిన మార్గదర్శకాలు జిల్లా విద్యాశాఖకు అందాయి. వాటిని అనుసరించిన ప్రస్తుత స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలోని పాఠశాలలు వాటి దూరం, ఆయా స్కూళ్లలో విద్యార్థులు, టీచర్ల సంఖ్యను క్షేత్ర స్థాయిలో పరిశీలించే పనిలో విద్యా శాఖ ఉంది. ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల మేరకు జిల్లాలో ప్రస్తుతం ఉన్న 162 స్కూల్ కాంప్లెక్స్‌ల స్థానంలో 131 క్లస్టర్లు ఏర్పాటు కానున్నాయి. ప్రతి క్లస్టర్‌కు గ్రామీణ ప్రాంతాల్లో 10 నుంచి 15 కిలోమీటర్ల పరిధిలో ఉన్న 10 నుంచి 15 పాఠశాలలు, పట్టణ ప్రాంతాల్లో 5 నుంచి 10 కిలోమీటర్ల పరిధిలోని 8 నుంచి 10 స్కూళ్లను అనుసంధానం చేస్తారు. దీంతో పాటు క్లస్టర్‌లో 40 నుంచి 50 మంది ఉపాధ్యాయులు సభ్యులుగా ఉంటారు. ఇకపై ప్రతి నెలా పాఠశాల కాంప్లెక్స్ సమావేశాలు కొత్త విధానంలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ, పాఠశాలల మధ్య విద్య అనుసంధానం, విద్యా వనరుల సామగ్రి తయారీ, తనిఖీలు, విద్యావ్యవస్థ పర్యవేక్షణ తదితర కార్యక్రమాలు క్లస్టర్ కేంద్రంగా నిర్వహిస్తారు.

సీఆర్పీ పోస్టుల కుదింపే లక్ష్యం

ప్రభుత్వ స్కూళ్లలో బోధనాంశాలపై టీచర్లకు శిక్షణ ఇచ్చే స్కూల్ కాంప్లెక్స్‌లను తగ్గిస్తున్న కూటమి ప్రభుత్వం ఈ విభాగంలో పని చేస్తున్న క్లస్టర్ రిసోర్స్ పర్సన్ల (సీఆర్‌పీ)ను కూడా తగ్గిస్తోంది. దీంతో జిల్లాలో ఖాళీగా ఉన్న సీఆర్‌పీ పోస్టుల ఉద్యోగావకాశాలను నిరుద్యోగులు కోల్పోతారు. మరో వైపు క్లస్టర్ల ఏర్పాట్లలో సీఆర్‌పీ పోస్టులు మిగిలిపోయే పరిస్థితి ఉంది. స్కూల్ కాంప్లెక్స్‌ల పునర్నిర్మాణం చేయాలని కూటమి ప్రభుత్వం జూలైలోనే పాఠశాల విద్యాశాఖను ఆదేశించింది. ఇందులో భాగంగా ఒక్కో మండలంలో రెండు స్కూల్ కాంప్లెక్స్‌లను ఒక్కటిగా చేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం 162 స్కూల్ కాంప్లెక్స్‌లున్నాయి. వీటిలో మంజూరైన సీఆర్‌పీ పోస్టులలో 7 వరకు ఇంకా భర్తీ చేయాల్సి ఉంది. తాజాగా ఏర్పాటు చేయనున్న క్లస్టర్ విధానం అమలులో భాగంగా ప్రధానోపాధ్యాయు పర్యవేక్షణలో సీఆర్‌పీ పోస్టులున్న 131 క్లస్టర్స్ మాత్రమే జిల్లాలో ఏర్పడతాయి. దీంతో నిరుద్యోగులకు కొత్తగా సీఆర్‌పీ పోస్టుల అవకాశం పోవడమే కాకుండా ప్రస్తుతం ఖాళీగా ఉన్న పోస్టులు రద్దు అవుతాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విద్యాసంబంధ పథకాలు, విద్యా కేలండర్, ఉపాధ్యాయుల శిక్షణ తదితర అంశాలను పరిశీలించి ప్రభుత్వానికి ఎంఈఓల ద్వారా నివేదిక అందించే కీలక విధులను సీఆర్‌పీలు నిర్వహిస్తున్నారు. కాంట్రాక్టు విధానంలో నియమితులైన వీరంతా బీఈడీ అర్హత ఉండడంతో గత ప్రభుత్వం క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్లు (సీఆర్‌ఎంటీ) గుర్తింపు ఇవ్వడంతో పాటు మండలంలో ఎక్కడైనా టీచర్ సెలవులో ఉన్నప్పుడు బోధనకు అంతరాయం లేకుండా వీరు అక్కడ పనిచేసేలా విధులు నిర్వహిస్తారు. క్లస్టర్ విధానం అమలుతో ఆ పోస్టులను తగ్గించే యోచనలో ఉండడంతో సీఆర్‌పీలు అలాంటి విధులు నిర్వహించే అవకాశం ఉండదు.

హెచ్‌ఎంకు ఎంఈఓ అధికారాల బదలాయింపు

కొత్తగా అమలులోకి తెస్తున్న క్లస్టర్ మార్గదర్శకాల మేరకు క్లస్టర్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు కీలకంగా మారనున్నారు. మండల యూనిట్‌లో ప్రస్తుతం డీడీఓ అధికారాలు ఎంఈఓలకు ఉండగా ఇకపై ఈ విధానానికి స్వస్తి చెప్పి త్వరలో క్లస్టర్ హెచ్‌ఎంకు జీతాల పంపిణీ అధికారం బదలాయింపు చేయనున్నారు. ఎంఈఓలు కేవలం పరిపాలన సంబంధ అంశాలకు మాత్రమే పరిమితం కానున్నారు. క్లస్టర్ స్కూళ్లలో ప్రధానోపాధ్యాయులపై ప్రస్తుతం ఉన్న రోజువారీ విధులకు అదనంగా క్లస్టర్ నిర్వహణ భారం పడడంతో పాటు ఎంఈఓలు నిర్వహిస్తున్న డీడీఓ బాధ్యతలను కూడా క్లస్టర్ హెచ్‌ఎంకే ఇవ్వనున్నట్లు సమాచారం.

ఉపాధ్యాయ సంఘాల పెదవి విరుపు

నూతన క్లస్టర్ విధానంపై ఉపాధ్యాయ సంఘాలు పెదవి విరుస్తున్నాయి. నిర్వహణ నిధులు పెంచకుండా ఎలాంటి కొత్త విధానం వచ్చినా ఫలితాలు సాధ్యం కాదని తేల్చి చెబుతున్నాయి. క్లస్టర్ కేంద్రాల నిర్వహణ కోసం రూ.లక్ష వరకు నిధులు కేటాయించాలని, ప్రత్యేక డిజిటల్ అసిస్టెంట్, బోధనేతర సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేస్తున్నాయి. పాఠశాలల సంఖ్యను పెంచినందున ఇద్దరు చొప్పున సీఆర్పీలను కేటాయించాలని కోరుతున్నాయి.

పీఎం సూర్యఘర్ యోజనను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. కలెక్టర్ సమావేశ మందిరంలో పీఎం ఎక్సలెన్సీ అవార్డు-2024, సూర్యఘర్ యోజనపై సంబంధిత అధికారులతో ఆయన శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన 11అంశాల అమల్లో కనీసం ఆరు అంశాల్లోనైనా ముందంజలో ఉండాలని, తద్వారా పీఎం ఎక్సలెన్సీ అవార్డుకు జిల్లా ఎంపిక కావాలని అన్నారు. జిల్లాలో చేపట్టిన పథకాలు, లబ్ధి పొందిన వారి వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించాలని, సాధించిన ప్రగతిపై డాక్యుమెంటరీని తయారు చేయాల్సి ఉంటుందన్నారు. అటువంటి ప్రగతి నివేదిక డాక్యుమెంటరీని పీఎం అవార్డు కోసం నామినేషనుకు పంపుతామని కలెక్టర్ పేర్కొన్నారు. ఇందుకు తమ శాఖలో నోడల్ అధికారులను నియమించుకొని చొరవ చూపాలని ఆదేశించారు. గత ఏడాది ఆశావహ(ఆస్పిరేషనల్)జిల్లాగా దక్షిణ భారతదేశంలోనే భామిని బ్లాక్ అవార్డు సొంతం చేసుకుందని, ఈఏడాది ఎక్సలెన్సీ అవార్డు కూడా జిల్లా సొంతం చేసుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. పీఎం సూర్యఘర్ యోజన చాలా మంచి పథకమని, దీని ఏర్పాటుకు ప్రతి ఒక్కరికీ బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తాయని, రూ.78వేల వరకు కేంద్ర ప్రభుత్వం నుంచి సబ్సిడీ లభిస్తుందన్నారు. ఈ పథకం ద్వారా వినియోగదారుడు ఉచిత విద్యుత్‌ను వినియోగించుకోవడమే కాకుండా మిగులు విద్యుత్ ద్వారా అదనపు ఆదాయం లభిస్తుందన్న సంగతిని కలెక్టర్ గుర్తు చేశారు. లబ్ధిదారుని స్పందనను, ప్రభుత్వం అందించే సదుపాయాలు, లాభాలపై ప్రజలకు తెలియజేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, కేఆర్‌ఆర్‌సీ ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్లు జి.శ్రీనివాసరాజు, సర్వేశ్వరరావు, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు కె.రామచంద్రరావు, వై.సత్యంనాయుడు, డీఎంహెచ్‌ఓ డా.ఎస్.భాస్కరరావు, ఇతర వైద్యాధికారులు డా.బి.వాగ్దేవి, డా.ఎం.వినోద్‌కుమార్, డా.టి.జగన్‌మోహనరావు, డా.కె.విజయపార్వతి, డీఈఓ ఎస్.తిరుపతినాయుడు, జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్, ఎల్‌డీఎం విజయ్ స్వరూప్, ఏపీఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీర్ కె.చలపతిరావు, డీపీఓ టి.కొండలరావు తదితరులున్నారు.

కొఠియాలో ఒడిశా అధికారుల తీరుపై నిరసన



దిగువశెంబిలో నిరసన తెలుపుతున్న నాయకులు, గిరిజనులు

సాలూరు: వివాదాస్పద ఆంధ్రా - ఒడిశా కొఠియా గ్రూపు గ్రామాల్లో ఒడిశా అధికారుల వేధింపులను నిరసిస్తూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మండలంలో కొఠియా గ్రూపు గ్రామాలైన దిగువశెంబి గ్రామంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొఠియా సరిహద్దు సమస్యను పరిష్కరించడంలో పాలకులు చిత్తశుద్ధి చూపడం లేదన్నారు. ఇటీవల ఒడిశా అధికారులు, పోలీసులు దిగువశెంబి గ్రామంలో ఆంధ్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రంలోకి అక్రమంగా చొరబడి వస్తువులు తీసుకువెళ్లడం సరికాదన్నారు. ఇటువంటి చర్యల వల్ల రెండు రాష్ట్రాల మధ్య గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒడిశా ప్రభుత్వం దూకుడుకు అడ్డుకట్ట వేయాలని, ఉద్యోగులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఏపీలో ప్రభుత్వం గిరిజనులకు రక్షణ కల్పించాలని, సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలన్నారు. లేకుంటే ఆందోళన చేపడతామన్నారు. నిరసనలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్‌పీఎఫ్ హెచ్‌సీకి విశిష్ట రైల్వే సేవా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న ఆర్‌పీఎఫ్ హెచ్‌సీ రవికుమార్

బలిజిపేట: మండలంలోని గౌరీపురం గ్రామానికి చెందిన వాన రవికుమార్ రైల్వేలో చేసిన సేవలకు గుర్తింపుగా విశిష్ట రైల్వే సేవా పురస్కారాన్ని ఈస్ట్ కోస్టు రైల్వే వారు భువనేశ్వర్‌లో శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధికారులు అభినందించారు. గౌరీపురం గ్రామానికి చెందిన రవికుమార్ విజయనగరంలో ఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. 2023 - 24 సంవత్సరంలో రూ.1.98 లక్షల విలువైన మాదక ద్రవ్యాల బ్యాగులు ఆరింటిని స్వాధీనం చేసుకున్నారు. రైలు కింద పడిన ఒక ప్యాసింజర్‌ను రక్షించి ఆస్పత్రిలో జాయిన్ చేసి సేవలు అందించారు. తప్పిపోయిన ముగ్గురు మైనర్ బాలికలను, ఇద్దరు మైనర్ బాలురను పట్టుకుని సీడబ్ల్యూసీ డిపార్టుమెంట్‌కు అప్పగించినందుకు, రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు తమ విలువైన సామగ్రిని విడిచివెళ్లిపోయిన వారికి తిరిగి అప్పగించడంలో నిస్వార్థంగా చేసిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం అందించినట్లు రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో పలువురు రైల్వే అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థి అనుమానాస్పద మృతి




మృతుడు నిఖిల్ (ఫైల్)

పాలకొండ: స్థానిక తమ్మినాయుడు ఇంటర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంపీసీ చదువుతున్న విద్యార్థి మిరియబిల్లి నిఖిల్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఇందుకు సంబంధించి మృతుని బంధువులు, కళాశాల యాజమాన్యం తెలిపిన వివరాలు.. కొత్తూరు మండలంలోని కురిగాం గ్రామానికి చెందిన మిరియబిల్లి తేజేశ్వరరావు చెన్నైలో ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. తల్లి హేమలత కురిగాం గ్రామంలో ఉంటుంది. వీరి పెద్ద కుమారుడు మిరియబిల్లి నిఖిల్ పాలకొండలోని తమ్మినాయుడు కళాశాలలో చదువుతూ కళాశాల వసతిగృహంలో ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి వసతిగృహం పైనుంచి పడిపోవడంతో యాజమాన్యం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించింది. మృతుని తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో వారు ఆస్పత్రికి చేరుకుని ఇక్కడ నుంచి శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ మేరకు ఎస్‌ఐ ప్రయోగమూర్తి శనివారం కళాశాలకు వెళ్లి విచారణ చేపట్టారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. ప్రమాదవశాత్తు పడిపోయాడా.., ఆత్మహత్య చేసుకున్నాడా.., ఇంకేమైన జరిగిందా... అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా మృతుడు తెలివైన విద్యార్థి కావడంతో కురిగాంలో పదవ తరగతిలో పాఠశాలలో మొదటి స్థానంలో నిలవడంతో కళాశాల యాజమాన్యం ఉచితంగా చదివిస్తుంది.

గడ్డి మందు తాగిన యువకుడి మృతి

వీరఘట్టం: స్థానిక తెలగవీధికి చెందిన పి.సునీల్ అనే యువకుడు గడ్డి మందు తాగి మృతి చెందినట్లు ఎస్‌ఐ జి.కళాధర్ తెలిపారు. వీరఘట్టం బి.ఎం.ఆర్ థియేటర్‌లో పని చేస్తున్న ఈ యువకుడు ఎప్పుడూ పరధ్యానంలో ఉండేవాడని చెప్పారు. సినిమా హాల్‌లో గడ్డిని తొలగించేందుకు ఉంచిన గడ్డి మందును వారం రోజుల క్రితం సేవించాడని, శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. యువకుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



కన్నూరి ఆదినారాయణ మృతదేహం

విజయనగరం క్రైమ్: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి రూరల్ ఎస్‌ఐ అశోక్‌కుమార్ అందించిన వివరాలిలా ఉన్నాయి. మెరకముడిదాం మండలం ఇప్పలవలస గ్రామానికి చెందిన కన్నూరి ఆదినారాయణ (40) ముడిదాం గ్రామంలో భవన నిర్మాణ రంగంలో తాపీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పనిలో భాగంగా శనివారం ఉదయం పరంజి మీద ఉన్న ఇనుప చువ్వను తొలగిస్తుండగా, ఆ ఇనుప చువ్వ పక్కన ఉన్న ఎలక్ట్రికల్ లైన్స్‌కి తగిలి కరెంట్ షాక్ తగిలి ఫస్ట్ ఫ్లోర్ నుంచి కింద పడి మృతి చెందాడు. ఇతనికి భార్య గౌరీ, పాప, బాబు ఉన్నారు. మృతుని భార్య కన్నూరి గౌరీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అశోక్‌కుమార్ తెలిపారు.

ప్రాణం తీసిన అతివేగం

- యువకుడు మృతి
- మరొకరికి గాయాలు



మృతుడు ముమ్మాని ప్రదీప్



గాయాల పాలైన లోకేష్

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. సీఐ బొడ్డేపల్లి సుధాకర్ తెలిపిన వివరాలివి.. విజయనగరం జిల్లా లక్కవరపుకోట మండలం కొత్యాడ గ్రామానికి చెందిన ముమ్మాని ప్రదీప్ (25), స్నేహితుడు లోకేష్ మూడు సంవత్సరాలుగా చిప్పాడలోని దివీస్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ, కంపెనీ క్వార్టర్స్‌లో ఉంటున్నారు. శుక్రవారం సాయంత్రం వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై వైజాగ్ వెళ్లారు. పనులు ముగించుకుని రాత్రి తిరిగి వస్తుండగా చిప్పాడ వద్ద ఎర్రమట్టిదిబ్బల సమీపంలో మార్లిన్‌కోఫ్ మలుపు వద్ద వారి ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ప్రదీప్ తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికుల సహాయంతో హుటాహుటిన కేజీహెచ్‌కు తరలించారు. రక్త స్రావం ఎక్కువ కావడంతో అప్పటికే ప్రదీప్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెనుక కూర్చున్న లోకేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రస్తుతం లోకేష్ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. అతివేగంతో రావడం వలన వాహనం అదుపు తప్పి, ప్రమాదానికి గురైనట్లు పోలీసులు తెలిపారు. ప్రదీప్ తండ్రి రమణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ప్రదీప్‌కు ఇంకా వివాహం కాలేదు. కుటుంబం విజయనగరంలోని స్వగ్రామంలో నివసిస్తోంది.

ముగిసిన జాతీయ స్థాయి వర్క్‌షాప్



సత్కారం పొందుతున్న వర్క్‌షాప్ ముఖ్యవక్తలు

విజయనగరం అర్బన్: పట్టణంలోని మహారాజా అటానమస్ కళాశాలలో గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి సైన్స్ అకాడమీ లెక్చరర్ వర్క్‌షాప్ శనివారం ముగిసింది. రెండవ రోజు వర్క్‌షాప్‌లో 'గణిత విశ్లేషణలో అంశాలు' అనే అంశంపై చెన్నై మేథమెటికల్ ఇన్‌స్టిట్యూట్ ప్రొఫెసర్ బీవీరావు, ప్రొఫెసర్ కృష్ణ హనుమంతు, మనోజ్ కుమిని తదితరులు విశ్లేషణలు ఇచ్చారు. ఫైనాన్షియల్ మార్కెటింగ్, మోడలింగ్, మాత్రికలు, నెట్‌వర్క్ విశ్లేషణలలో గణితశాస్త్ర వినియోగం కీలకంగా నిలుస్తుందని అన్నారు. అనంతరం ముఖ్య వ్యక్తలను ఘనంగా సత్కరించారు. బెంగుళూరుకు చెందిన ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్స్ వారి సహకారంతో జరిగిన ఈ వర్క్‌షాప్‌లో ఆంధ్రయూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ జీసీరావు, మాన్సాస్ విద్యా సంస్థల కరస్పాండెంట్ డాక్టర్ కేవీఎల్ రాజు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సాంబశివరావు, గణిత శాస్త్ర విభాగాధిపతి ఎస్.సూరిబాబు, గణిత శాస్త్రం సీనియర్ అధ్యాకులు సీఎస్‌కే ఉమాశంకర్, బి.ఝాన్సీ, ఎం.స్వామి నాయుడు, టి.స్వాతి, ఎంవీలక్ష్మి, డి.రమేష్, డాక్టర్ శ్రీదేవి, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ అచ్చుతరావు, వివిధ డిగ్రీ కళాశాల నుంచి 150 మంది అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మందుబాబుల చిందరవందర



ఎస్.కోటలో వన్‌వే జంక్షన్ వద్ద మందుబాబులు చిందర వందర చేసిన సామగ్రి

శృంగవరపుకోట : మందుబాబులం.. మేం మందుబాబులం.. మందు కొడితే మాకు మేమే మహారాజులం.. అన్న సినీ పాట మాదిరిగా పట్టణంలో మందు కొట్టి మందిపై పడుతున్నారు మందు బాబులు. విచ్చలవిడిగా వైన్ షాపులకు లైసెన్సులు ఇచ్చిన కూటమి ప్రభుత్వం తీరును సామాన్యులు, మహిళలు దుమ్మెత్తి పోస్తున్నారు. ఇందుకు నిదర్శనం ఈ ఫొటో. ఇటీవల కూటమి సర్కారు వైన్ షాపులకు లైసెన్సులు ఇబ్బడి ముబ్బడిగా ఇచ్చింది. వైన్ షాపులకు లైసెన్సులు దక్కించుకున్న వారంతా ఇప్పుడు సిండికేట్‌గా ఒక్కటై వారికి అనుకూలంగా ఉండేలా పరస్పరం షాపులు మార్చుకున్నారు. ఇంత వరకూ బాగానే ఉన్నా గుడి - బడి అన్న తేడా లేకుండా జనావాసాల మధ్య, ప్రధాన రహదారులపైనా, దేవాలయాలు, పాఠశాలల సమీపంలో, వైన్ షాపులు తెరిచారు. పట్టణంలో వన్‌వే జంక్షన్ వద్ద పూటుగా మందుతాగి మత్తెక్కిన మందుబాబులు శనివారం ఉదయం వైన్‌షాపు పక్కన ఉన్న కిరాణా దుకాణంపై పడి వీరంగం సృష్టించారు. దుకాణంలో సామగ్రి అంతా రోడ్డుపై విసిరి చిందర వందర చేశారు. దీంతో సుమారు అర్ధగంట పాటూ ట్రాఫిక్ నిలిచిపోయి జనం అవస్థ పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు పాపం మందు బాబులకు ప్రోటోకాల్ నిర్వహించి జనానికి సర్ది చెప్పుకున్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు నమోదు

లక్కవరపుకోట : మండలంలోని చందులూరు గ్రామానికి చెందిన ఏపీఎస్ఆర్టీసీలో డ్రైవర్‌గా పని చేస్తున్న ఆతవ శ్రీనివాసరావుపై లక్కవరపుకోట పోలీస్‌లు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ టి.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. నిందితుడు శ్రీనివాసరావు ఎస్.కోట ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఈయన గత కొద్ది సంవత్సరాల నుంచి లక్కవరపుకోట మండలంలో ఓ గ్రామానికి చెందిన మహిళను గత కొద్ది సంవత్సరాలుగా లైంగికంగా అనుభవిస్తూ రెండో పెళ్లి చేసుకుంటానని వేధిస్తున్నాడని, ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుడు శ్రీనివాసరావుని శనివారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

బెల్టు షాపులపై ఎక్సైజ్ పోలీసుల దాడి



పట్టుకున్న మద్యం సీసాలు

సీతానగరం: ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్ పరిధిలో రెండు మండలాల గ్రామాల్లో మద్యం బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించి ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్టు సీఐ పద్మావతి తెలిపారు. బలిజిపేట మండలం గంగాడలో 7 మద్యం సీసాలతో ఒకరిని, సీతానగరం మండలం బూర్జలో 10 సీసాలతో ఒకరిని, అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్రమంగా మద్యం బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారనే సమాచారం రావడంతో సిబ్బంది సహకారంతో సోదాలు చేసినట్టు తెలిపారు. సీతానగరం, బలిజిపేట, గరుగుబిల్లి మండలాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తున్న వారి నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

కేసుల రాజీకి చర్యలు చేపట్టండి

- రెండో అదనపు జిల్లా జడ్జి దామోదరరావు



మాట్లాడుతున్న రెండవ అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ అధ్యక్షుడు ఎస్.దామోదరరావు

పార్వతీపురం టౌన్: కోర్టులో పెండింగ్ కేసులను రాజీ చేసేలా చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖ, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులకు రెండో అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ అధ్యక్షుడు ఎస్.దామోదరరావు సూచించారు. మార్చి 8వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమానికి సంబంధించి తీసుకునే చర్యలపై జిల్లా కోర్టు సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ కార్యక్రమంలో సివిల్, క్రిమినల్ కేసులు, మోటారు ప్రమాద పరిహార కేసులు అధిక మొత్తంలో రాజీ కుదిర్చేలా కృషి చేయాలన్నారు. కోర్టులో ఎక్కువ కేసులు పెండింగ్‌లో ఉండడం వల్ల కక్షిదారులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని సాధ్యమైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జడ్జి అన్నారు. రాజీ చేయడం ద్వారా కక్షిదారులకు శ్రమ, ఖర్చుల నుంచి ఉపశమనం కలుగుతుందని తెలిపారు. సమావేశంలో అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జె.సౌమ్య జాస్పిన్, పార్వతీపురం పట్టణ పోలీస్ ఇన్‌స్పెక్టర్ గోవింద, రూరల్ ఇన్‌స్పెక్టర్ సంతోషికుమారి, గరుగుబిల్లి ఇన్‌స్పెక్టర్ రమేష్‌నాయుడు, ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ రేవతమ్మ, హెడ్ కానిస్టేబుళ్లు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.శ్రీనివాసరావు, మాజీ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గొర్లె వెంకటరావు, న్యాయవాదులు ఎం.వెంకటరావు, ఎస్.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో కత్తెర పురుగుపై తస్మాత్...



లక్ష్మీపురంలో జొన్న చేనులో తెగుళ్లు నివారణకు పిచికారీ చేస్తున్న రైతు

సీతానగరం: మండలంలోని మాగాణి భూముల్లో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ఆశిస్తున్న కారణంగా రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. మండలంలోని లక్ష్మీపురం, చెల్లంనాయుడువలస గ్రామాల్లో జొన్న చేను పంటలో కత్తెర పురుగు ఆశించడాన్ని శనివారం ఆయన గుర్తించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంచు విపరీతంగా కురవడం, పంట ఏపుగా పెరగడం వల్ల ఆకులపై రాత్రివేళల్లో కత్తెర పురుగులు ఆశించి ఆకులను కత్తిరించిన మాదిరిగా తినేస్తున్నాయని తెలిపారు కత్తెర పురుగులు చేరిన తరువాత మొవ్వను అడ్డదిడ్డంగా తినేస్తాయని, దీని నివారణకు ఎమోమెక్టిన్ బెంజాయిట్ మందును పిచికారీ చేయాలని సూచించారు. జొన్న చేనులో ఆకులు ఎర్రబారితే మల్టీకే ఎకరాకు 1 కేజీ మందు 200లీటిలో కలిపిన మందు ద్రావణాన్ని పిచికారీ చేస్తే చేనులో నీరును తట్టుకుని చేను ఏపుగా పెరుగుతుందన్నారు.